క్లుప్తంగా

ఎంపీడీవో విమాదేవి బాధ్యతల స్వీకరణ



ఫిరంగిపురం: ఎంపీడీఓ జె.విమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం నుంచి బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. ప్రస్తుత ఇన్చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న విలియమ్స్ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీఓ విమాదేవికి ఎంపీపీ షేక్.హెలా నర్గీస్, పలువురు పంచాయతీ అధికారులు, కార్యాలయ సిబ్బందిఅభినందనలు తెలిపారు.

ఎంపీడీఓ భార్గవి బాధ్యతల స్వీకరణ



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన బి. భార్గవికి ఎంపీపీ డి. సంతోష రూపవాణి గురువారం అభినందనలు తెలిపారు. విజయవాడ నుంచి ఆమె బదిలీపై వచ్చారు. గత ఎంపీడీఓ వీరయ్య.. భార్గవికి బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీఓను ఆమె చాంబర్‌లో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆమెకు అభినందనలు తెలిపారు.

చింతలపూడి కల్వర్ట్ ప్రారంభం



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన పలు చి కల్వర్ట్‌ను గురువారం ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఎంపీడీఓ భార్గవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎండీఎఫ్ నిధుల రూ.12 లక్షలతో కల్వర్ట్ నిర్మాణంతో పాటు సీసీ రోడ్ నిర్మించినట్లు తెలిపారు. ఇక్కడ మురుగు ప్రవహిస్తుండడంతో గ్రామ ప్రజల ఇబ్బందులు గుర్తించి, కల్వర్ట్ నిర్మాణం చేపట్టిన్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి దేవరపల్లి వీరయ్య, పంచాయతీ సెక్రటరీ తాడిబోయిన మణికంత, చింతలపూడి మాజీ సర్పంచ్ నల్లనూకల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



తాడికొండ: ఎంపీడీవోగా పి.అనురాధ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం నుంచి ఆమె బదిలీపై వచ్చారు.

రేపు సాయిబాబా మందిర వార్షికోత్సవం



పెదవడ్లపూడి(మంగళగిరి): దక్షిణ షిర్డిగా ప్రసిద్ధి చెందిన నగర పరిధిలోని పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిర్డి సాయిబాబా మందిరం 18 వ వార్షికోత్సవం ఈ నెల 3న శనివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. గుంటూరు జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానుండడంతో భక్తులకు స్వామి వారి దర్శనంతో పాటు అన్నప్రసాద వితరణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఉదయం 5.30 గంటలకు స్వామి వారికి కాగడ హారతి, 6 గంటలకు పాలాభిషేకం, 8 గంటలకు అన్నాభిషేకం, 9 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 10 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సినీ గాయకులతో సంగీత విభావరి, జబర్దస్త్ హాస్యవల్లరి, మిమిక్రి, మ్యాజిక్ షోలు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 8 గంటల నుంచి అన్నదానం ఏర్పాటు చేశారు.

పట్టణ ప్రజాదరణ ఎన్‌క్యాస్

- కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు
- 9 వైద్యశాలల్లో ఐదింటికి కేంద్ర ఆరోగ్య శాఖ 'ఎన్‌కాస్' సర్టిఫికెట్
- వసతుల కల్పన, మెరుగైన వైద్య సేవలకు గుర్తింపు
- అనతి కాలంలో.. అత్యధిక పట్టణ ప్రజాదరణ
- పేదలకు ఆరోగ్య సంజీవనిగా నిలుస్తున్న ఆసుపత్రులు



యర్రబాలెం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలలోని హెల్త్ సెంటర్



మంగళగిరి: మంగళగిరి, తాడేపల్లి నగరంలో నూతనంగా ఏర్పాటు అయిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య సంరక్షణకు అభయమిస్తున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రులను తలపిస్తున్న వైఎస్సార్ అర్బన్ విలేజ్ హెల్త్ సెంటర్‌లు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుచాయి. ఇటీవల గణపతి నగర్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ దేశంలోనే అత్యధికగా 96.2 మార్కులు సాధించి, నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌కాస్) సర్టిఫికేట్‌ను పొందింది. మెరుగైన వసతులు, వైద్య సదుపాపాయలు కల్పిస్తున్న ప్రజా ఆసుపత్రులకు ఈ సర్టిఫికెట్ అందజేస్తుంది. యర్రబాలెం, డొల్లాస్ నగర్, తాడేపల్లి, పెదవడ్లపూడి హెల్త్ సెంటర్లు ఇప్పటికే ఎన్కాస్ సర్టిఫికేట్‌లు పొందాయి. ఈ నెలలో కాజ, మార్కేండేయ కాలనీ హెల్త్ సెంటర్లు ఎన్కాస్ సర్టిఫికేట్‌లు పొందనున్నాయి.

మార్చి నాటికి నిడమర్రు, చినకాకాని, లక్ష్మీనృసింహస్వామి కాలనీ, కుంచనపల్లి, రామచంద్రాపురం హెల్త్ సెంటర్లలో మెరుగైన వైద్య సేవలందించి ఎన్కాస్ సర్టిఫికేట్‌లు సాధించించేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది కృషి చేస్తున్నారు. అనతి కాలంలోనే వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు ఎన్కాస్ సర్టిఫికేట్ పొందాయంటే ఇక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది.

ఆదరణ అమోఘం

ఈ హెల్త్ సెంటర్లలో ప్రాథమికంగా షుగర్ బీపీ, జ్వరం, వాంతులు, విరేచనాలతో రోగులకు పలు రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఒక్కో ఆసుపత్రికి రోజుకు సరాసరి 200 మందికి పైగా రోగులు వస్తున్నారు. ప్రతి ముప్పై వేల మందికి ఒక అర్బన్ హెల్త్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తున్న ప్రభుత్వం.. అందులో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలందిస్తోంది. ఇంటి వద్దనే వైద్య సేవలందుతుండడంతో రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలు..

నగరంలో నూతనంగా నిర్మించి, అందుబాటులోకి వచ్చిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు చినకాకాని, నిడమమర్రు, యర్రబాలెం, లక్ష్మీనృసింహస్వామి కాలనీ, గణపతి నగర్, కుంచనపల్లి, రామచంద్రాపురం, రాజీవ్ గృహ కల్ప సెంటర్, డొల్లాస్ నగర్‌లలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఒకొక్క అర్బన్ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సులు ఇద్దరు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నిషియన్, డీఈఓ, ఎల్‌జీఎస్‌సీ సిబ్బందితో పాటు వాచ్‌మెన్‌లను నియమించారు. వారంలో మూడు రోజులు ప్రత్యేక డాక్టర్ అందుబాటులో ఉంటారు. సోమవారం ఆర్థోపెడిక్, మంగళవారం జనరల్ సర్జన్, బుధవారం చెవి, గొంతు ముక్కు రోగుకులకు పరీక్షలు నిర్వహించి, సేవలందిస్తున్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా

మంగళగిరి, తాడేపల్లి నగరం పరిధిలో కొత్తగా 9 అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించి, రోగులకు సేవలందిస్తున్నారు. ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రభుత్వం రూ.82 లక్షలు కేటాయించగా, నగర పాలక సంస్థ నిధులు మరో రూ.80 నుంచి రూ.90 లక్షలు వెచ్చించి కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా తీర్చిదిద్దారు. దీంతో అర్బన్ హెల్త్ సెంటర్లలో నాణ్యమైన, మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు.



పరీక్షలకు ఏర్పాటు చేసిన ఆధునిక ల్యాబ్


ప్రసవాలు చేస్తున్నాం..



వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అన్ని రకాల జబ్బులుకు వైద్యం అందిస్తున్నాం. అత్యధికంగా గర్భిణులు, వృద్ధులు వైద్య పరీక్షల కోసం వస్తున్నారు. ప్రసవాలు కూడా చేస్తున్నాం. బెడ్స్‌తో పాటు అత్యాధునిక ల్యాబ్ పరికరాలు ఉన్నాయి. రోజు రోజుకు రోగుల సంఖ్య పెరుగుతోంది.

– డాక్టర్ పి.అనూష, మెడికల్ ఆఫీసర్, గణపతి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్

నాకు గుండె ఆపరేషన్ చేయించారు..



చిన్నపాటి జ్వరం అని వచ్చినా వైద్యులు అన్ని పరీక్షలు చేశారు. గుండె సమస్య ఉందని తెలుసుకుని వారే ఎన్ఆర్ఐ ఆసుపత్రికి రిఫర్ చేసి, వైఎస్సార్ ఆరోగ్య శ్రీలో ఆపరేషన్ చేయించారు. ఇంటికి వచ్చిన తర్వాత హెల్త్ సెంటర్ వైద్యురాలు క్రమం తప్పకుండా వచ్చి.. నా ఆరోగ్యం గురించి తెలుసుకుంటోంది. మందులు ఇస్తోంది. గతంలో ఇలాంటి వైద్యం ఎన్నడూ లేదు.

– షేక్ గాలిబ్, మంగళగిరి.

నిరీక్షణ ఫలించింది..శాశ్వత నీడ దొరికింది

- వడ్డేశ్వరం ఇందిరా నగర్ వాసులకు ఇళ్ల పట్టాలు
- పంపిణీ చేసిన సబ్ కలెక్టర్ ప్రకాశ్ జైన్
- సంతోషం వ్యక్తం చేసిన నివాసితులు



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న సబ్ కలెక్టర్ ప్రకాశ్ జైన్

తాడేపల్లిరూరల్ : ఇళ్ల పట్టాల పంపిణీపై వడ్డేశ్వరం ఇందిరా నగర్ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గురువారం వడ్డేశ్వరం ఇందిరా నగర్‌లో 17 సంవత్సరాల నుంచి నివాసముంటున్న పేద ప్రజలకు సబ్ కలెక్టర్ ప్రకాశ్ జైన్.. తహసీల్దారు మర్రెడ్డి నాగిరెడ్డి, ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ బిక్కరెడ్డి శివారెడ్డితో కలసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. సబ్ కలెక్టర్ ప్రకాశ్ జైన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అభ్యంతరం లేని భూములన్నింటిలో నివాసాలు ఏర్పరచుకున్న వారికి పట్టాలు అందజేస్తోందని తెలిపారు. అందులో భాగంగా వడ్డేశ్వరంలో 44 మంది పేదలకు పట్టాలు అందజేసినట్లు తెలిపారు. వీరంతా గుడిసెల వేసుకుని జీవిస్తున్నారని, వాటిని తొలగించి, అభివృద్ధి చేసి, తిరిగి ఇస్తామని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు మాట్లాడుతూ వడ్డేశ్వరం ఇందిరానగర్‌లో గతంలో వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా నాటి ఎమ్మెల్యే మురుగుడు హనుమంతరావు పట్టాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం వైఎస్సార్ తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పట్టాలు అందజేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకుడు జొన్నా శివశంకరరావు, సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ వడ్డేశ్వరం అధ్యక్షుడు గొడవర్తి శ్రీనివాసరావు, ఆర్ఐ వంశీ, వీఆర్వో ఆశ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇన్నాళ్లూ బిక్కుబిక్కుమంటూ..



రెక్కాడితే కానీ డొక్కాడని మేము ఇందిరా నగర్‌లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాం. 17 ఏళ్ల నుంచి ఇక్కడే బిక్కుబిక్కుమంటూ ఉంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వల్ల మాకు ఇంటి పట్టా వచ్చింది. ప్రభుత్వం ఇల్లు కూడా నిర్మించి ఇస్తే మాకు ఎంతో ఆసరగా ఉంటుంది.

వడ్డేశ్వరపు దీనమ్మ, కోటేశ్వరరావు

నిరీక్షణ ఫలించింది



భర్త లేని నేను ఆయాగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాను. ప్రతిసారి ఇల్లు తొలగిస్తామని అధికారులు భయపెట్టేవారు. ఇల్లు తొలగిస్తే ఎలా బతకాలో అర్థమయ్యేది కాదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో జీవితంపై భరోసా కల్పించినట్లయ్యింది.

– అముతలపూడి ఊర్ధమ్మ

ఇక ఇల్లు తొలగిస్తారనే భయం లేదు



ఇన్నాళ్లు ఎంతో భయపడుతూ జీవించాం. కొంత మంది ఈ భూమిని కాజేయడానికి ఇబ్బందులకు గురిచేశారు. సీఎం జగన్ మాకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఇక ఎటువంటి భయం లేకుండా జీవిస్తాం.

– ఎస్కే మౌలాబి

అప్పల బాధ భరించలేక పురుగు మందు తాగి..

గుంటూరు ఈస్ట్: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఘటనపై నగరం పాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన ఎం.తిరుమలరావు అప్పుల బాధ భరించలేక గురువారం జెడ్పీ కాంపౌండ్ సమీపంలో పురుగు మందుతాగాడు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్ సహాయంతో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వ్యక్తి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లచెరువుకు చెందిన షేక్ ఇమ్రాన్ (29) అప్పుల బాధ భరించలేక జనవరి 26న కేవీ కాలనీలోని ఖాళీ స్థలంలో పురుగు మందు తాగాడు. అనంతరం విషయాన్ని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతిపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

- ఎక్కడా అభివృద్ధి ఆగలేదు
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత విస్తృత పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుచరిత

తాడికొండ: రాజధాని అమరావతిపై ప్రతిపక్షాలది దుష్ప్రచారమే తప్ప.. ప్రభుత్వ పరంగా అభివృద్ధి ఎక్కడా ఆగలేదని ఎమ్మెల్యే, తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. గురువారం తుళ్ళూరు మండలం వెంకటపాలెం, మందడం, తాళ్ళాయపాలెం, ఐనవోలు గ్రామాల్లో ఆమె విస్తృతంగా పర్యటించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలతో మమేకమయ్యారు. వెంటపాలెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, ఏపీ ప్రభుత్వ సలహాదారు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మేకతోటి సుచరిత మాట్లాడారు. మూడు రాజధానులకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అమరావతి శాసన రాజధానిగా, పరిపాలనా రాజధానిగా విశాఖ, న్యాయ రాజధానిగా కర్నూలు ఉంటుందన్నారు. అమరావతి రైతులకు జీవన భృతి కింద అందించే పింఛన్ రూ.2500– రూ.5000 చేస్తానని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట ఇచ్చారని, మరోమారు ఈ విషయంపై సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అమరావతిలో అభివృద్ధి ఆగలేదని, భారీ ప్రాజెక్టుల ద్వారా పనులు జరుగుతూనే ఉన్నాయన్నారు. అమరావతిని అభివృద్ధికి దూరం చేస్తానని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎప్పుడూ చెప్పలేదని, రానున్న రోజుల్లో అమరావతి గొప్ప నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. తన సొంత నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేసుకోవాలని జగనన్నను అడగగానే ఇక్కడకు పంపించారని.. తనకు ఎలాంటి వర్గాలు లేవు, విభేదాలు లేవని స్పష్టం చేశారు. తాడికొండలో ఎమ్మెల్యేగా సుచరితను ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీ ఇవ్వాలని వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. వెంకటపాలెంలో నిర్వహించిన కార్యకర్తలు, నాయకుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలందరూ జగనన్న పట్ల నమ్మకంతో ఉన్నారని.. జన ప్రభంజనం చూస్తే.. అర్థమవుతుందన్నారు. ఎమ్మెల్యే సుచరిత వెంకటపాలెం, మందడం, తాళ్ళాయపాలెం, ఐనవోలు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. తుళ్ళూరు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, కొప్పుల శేషగిరి రావు, తాడికొండ అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, సొసైటీ అధ్యక్షులు ఆలూరి పెద్దశ్రీను, నాయుడు నాగేశ్వరరావు, ఆలూరి చిన్న శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన విభాగం నాయకులు చలివేంద్ర సురేష్, జిల్లా నాయకులు తూమ్మూరు రమణారెడ్డి, శృంగారపాటి సందీప్, గ్రామ పార్టీ అధ్యక్షులు అన్నూరు జక్రయ్య, పాలకాయల శేషగిరి, ఐనవోలు సుధీర్, ఆరేపల్లి జోజి, బెజ్జం రాంబాబాబు, కొప్పుల ఆంధ్రేయప్ప, కొయ్యగూర వినోద్, జయరావు, గంజిమాల కోటేశ్వరరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించడం లేదా

ఎమ్మెల్సీ హనుమంతరావు, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి



ఈమని సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, గంజి చిరంజీవి

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలో రూ.2.20 కోట్ల వ్యయంతో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను గురువారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త గంజి చిరంజీవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.43.60లక్షలతో గొడవర్రు గ్రామ సచివాలయం, రూ.20.80లక్షలతో విలేజ హెల్త్ క్లినిక్, రూ.23.94 లక్షలతో ఆర్బీకే, రూ.43.60లక్షలతో ఈమని గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.43.60లక్షలతో పెదకొండూరు సచివాలయ భవనం, రూ.20.80లక్షలతో విలేజ హెల్త్ క్లినిక్ నిర్మించినట్లు తెలిపారు. వీటిని ఘనంగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలకు, ఆసుపత్రులను ఆధునీకరించినట్లు గుర్తుచేశారు. ప్రతిపక్షాలు ఇవేమీ గమనించకుండా నోటికొచ్చినట్లు విమర్శలు చేయడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేతకోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, ఎంపీడీఓ వీరయ్య, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొండా నాగభూషణ్

తాడేపల్లిరూరల్ : యువ వ్యాపారవేత్తలుగా, వ్యాపార ఔత్సాహికులుగా అందివచ్చిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ సుస్మిత శెట్టి సూచించారు. గురువారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సదస్సుకు ముంబాయి స్టాక్ చేంజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొండా నాగభూషణ్, సీడీఎస్ఎల్ హైదరాబాద్ రీజినల్ హెడ్ శివ ప్రసాద్‌తో కలసి ముఖ్య అతిథి సుస్మిత శెట్టి విచ్చేశారు. మూల ధన వనరులను కంపెనీలు ఏ విధంగా సమకూర్చుకుంటాయో విద్యార్థులకు వివరించారు. పెట్టుబడిదారుడు షేర్ మార్కెట్‌ను కూడా ఒక వ్యాపార అవకాశంగా మలచుకుని.. వ్యాపారవేత్తలుగా ఎన్నో అవకాశాలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.హేమ దివ్య, ఉప విభాగ అధిపతి డాక్టర్ సీహెచ్ బాలాజీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇళ్లు తొలగిస్తే సహించేది లేదు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి సలాం సెంటర్, ముగ్గురోడ్డు రామాలయం, లంబాడీ పేట, పోతురాజుగుడి తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల ఇళ్లు తొలగిస్తే సహించేంది లేదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. రైల్వే స్థలాల్లో నివసిస్తున్న వారు ఫిబ్రవరి 3వ తేదీ లోపు ఖాళీ చేయాలని రైల్వే అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఆ పార్టీ నేతల బృందంతో కలసి ఆయన పర్యటించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 80–90 ఏళ్ల క్రితం రైల్వే కాంట్రాక్ట్ పనులకు తీసుకువచ్చిన ప్రజలకు ఈ స్థలాలు చూపించారని, వారు ఇక్కడ ఇళ్లు వేసుకుని జీవిస్తున్నారని చెప్పారు. ఈ భూమిని ఖాళీ చేయాల్సి వస్తే రాష్ట్ర ప్రభుత్వం రైల్వేశాఖ నుంచి కొనుగోలు చేసి ఇక్కడే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆల్ పార్టీ మీటింగ్స్ ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందించి పేదలకు అండగా నిలబడతాన్నారు. అజయకుమార్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయం చూపకుండా అకస్మాత్తుగా వెళ్లి పోమ్మనడం దారుణమన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అరుణ్‌కుమార్, కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ నాయకులు పాల్గొన్నారు.

ఆసుపత్రులకు వెళ్లి.. పింఛను ఇచ్చి



ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందుతున్న పెద్దలంక సీతమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీరు శ్వేత



గుంటూరు ఆసుపత్రిలో రాజ్యలక్ష్మికి వృద్ధాప్య పింఛను ఇస్తున్న వలంటీరు



హాస్పిటల్‌లో వృద్ధాప్య పింఛను అందుకుంటున్న మంగళగిరికి చెందిన వెంకట రాజ్యం

మంగళగిరి: నగరంలో పెన్షన్ల పంపిణీ గురువారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైంది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు, కార్పొరేషన్ అధికారుల పర్యేక్షణలో ఇంటింటికీ పెన్షన్లను పంపిణీ చేశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారికి ఆసుపత్రలకు వెళ్లి.. వలంటీర్లు పింఛను నగదు అందజేశారు.